

లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం

గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్డు పక్కన నిర్మించిన రైతుబజార్ మార్కెట్ షెడ్లు నిరుపయోగంగా మారాయి.

వివరాలు 8లో ▸



విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. దీంతో గ్రామాలు, తండాల్లో సైతం మద్యం ఏరులై పారుతోంది.

వివరాలు 8లో ▸



ఠాణా ప్రారంభమెప్పుడో..?

మండలాల ఏర్పాటులో భాగంగా కొమురవెల్లిలో నూతన పోలీస్‌స్టేషన్‌ను తాత్కాలికంగా ఆలయ వసతి గదిలో ఏర్పాటు చేశారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

19న మల్లన్న ఆలయంలో బహిరంగ వేలం

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జునస్వామి ఆలయంలో 19న సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో బాలాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో పూజలకు సంబంధించిన సామగ్రి సరఫరాకు ఆసక్తి కలవారు ఏదైనా జాతీయ బ్యాంకులో కార్యనిర్వహణాధికారి శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానం, కొమురవెల్లి పేరున డీడీతీసి 19న ఉదయం 11 గంటలోపు టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు. వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పురాతన ఆలయాల అభివృద్ధి

కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు



వేణుగోపాలస్వామి సన్నిధిలో హన్మంతరావు

దుబ్బాకటౌన్: రాష్ట్రంలోని అన్ని పురాతన ఆలయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హన్మంతరావు తెలిపారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్‌లో ప్రసిద్దిగాంచిన రాజా వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. స్థానికుల ఆహ్వానం మేరకు ఆలయాన్ని సందర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థినులకు సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ తదితరులు

నంగునూరు(సిద్దిపేట): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు రెండో బహుమతి సాధించిన నర్మేట పాఠశాల విద్యార్థులను సర్పంచ్ అజీద్, ఉపాధ్యాయులు, యువజన సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మహబూబ్ నగర్‌జిల్లా నారాయణరావుపేటలో నిర్వహించిన అండర్ 14 వాలీబాల్ బాలికల విభాగంలో విద్యార్థులు కాడిపల్లి శిరీష, శివాని ఎంపికయ్యారు. పోటీలు ముగించుకుని గ్రామానికి చేరుకున్న పీఈటీ రాజ్‌కుమార్, విద్యార్థులను ఎంఈఓ దేశిరెడ్డి, సర్పంచ్, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకన్న, కుమార్, శ్రీనివాస్, సత్యనారాయణ, ఉపేందర్‌రెడ్డి, కనకయ్య, మన్మోహన్‌రెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.

జిల్లా అధ్యాపకుల సంఘం అధ్యక్షుడుగా రామచంద్రయ్య



మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న గొల్లూరి రామచంద్రయ్య ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ, ప్రధాన కార్యదర్శి గొంటి రవి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం, వారి సమ స్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా నూతన కార్యవర్గం



గజ్వేల్‌రూరల్: ఎమ్మార్పీఎస్ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటైంది. జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ముంద్రాయి కృష్ణ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా రాజు, కార్యదర్శిగా పవన్ కల్యాణ్, ఉపాధ్యక్షుడిగా అశోక్, శ్రీనివాస్, మహేశ్, సహాయ కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా రాజు, ప్రచార కార్యదర్శిగా కరుణాకర్, నర్సింలుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

క్షణికావేశం.. తీరని శోకం

- ఆయువు తీసుకుంటున్న పోలీసులు
- వారి ఆయుధాలే యమ పాశాలు
- ఒత్తిడి, వ్యసనాలే కారణాలు
- గడిచిన 8 ఏళ్లలో 3 ఘటనలు
- తాజాగా చిన్నకోడూర్ ఘటన



రామునిపట్ల గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఇంటి వద్ద గుమిగూడిన ప్రజలు(ఫైల్)

సిద్దిపేటకమాన్: క్షణికావేశం, పని ఒత్తిడి, వ్యక్తిగత కారణాలతో కొందరు పోలీసు అధికారులు విచక్షణ కోల్పోయి ప్రాణాలు తీసుకుంటున్నారు. విధి నిర్వహణలో భాగంగా, ఆత్మరక్షణ, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఉపయోగించాల్సిన ఆయుధాలతో తమ ప్రాణాలు తీసుకోవడం, అయిన వారిని కూడా కడతేర్చేందుకు వాడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. శుక్రవారం చిన్నకోడూర్ మండలం రామునిపట్ల గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ జిల్లా కలెక్టర్ వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న నరేశ్ ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి అప్పులపాలై భార్య, ఇద్దరు పిల్లలను కాల్చి చంపి, అదే గన్‌తో తనను తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలో అభంశుభం తెలియని ఇద్దరు చిన్నారులు, అతడి భార్య ప్రాణాలు కోల్పోయారు. నలుగురు మృతి చెందడంతో ఈ ఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. ఇదే తరహాలో గడిచిన ఏనిమిదేళ్లలో జిల్లాలో మూడు ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలను తీవ్రంగా పరిగణించి పోలీసు ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులు, సిబ్బందితో ప్రతినెలా సమావేశం నిర్వహించి ఇలాంటి విషయాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఈ తరహా పరిస్థితులు ఎందుకు ఎదురవుతున్నాయి.. పని ఒత్తిడిని అధిగమించేందుకు చేస్తున్న కార్యాచరణ ఏమిటి, తమ దగ్గర ఉన్న ఆయుధాలు ఎలాంటి సమయంలో వినియోగించాలి, ఎలాంటి సమయంలో వినియోగించకూడదు అనే అంశాలపై మరింత లోతుగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ ఆన్‌లైన్ గేమ్‌లకు సంబంధించి ఎవరైనా కావాలనే ఉద్దేశపూర్వకంగా ప్రేరేపిస్తున్నారా? లేక అసలు వాటివైపు ఆలోచన ఎలా వస్తుందనే అంశాలపైన పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించాలని చర్చసాగుతోంది. పోలీసు ఉద్యోగం అంటేనే సవాళ్లతో కూడుకున్నది. విధి నిర్వహణలో పని ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు శిక్షణ కూడా నిర్వహిస్తున్నారు. పని ఒత్తిడికి తోడు వ్యక్తిగత, ఇతరత్రా కారణాలతో సిబ్బంది తమ ఆయుధాలతో ప్రాణాలు తీసుకోవడం తీవ్రంగా కలిచివేస్తోంది. 11 నెలల కాలంలో ఇద్దరు ఎస్‌ఐలు ఒకే పోలీసు స్టేషన్‌లో సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించాయి.



2017లో ఆత్మహత్య చేసుకున్న కుకునూర్‌పల్లి ఎస్‌ఐ ప్రభాకర్ రెడ్డి(ఫైల్)

జిల్లాలో జరిగిన ఘటనలు

- 2016, ఆగస్టులో కుకునూర్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న వి.రామకృష్ణారెడ్డి తన క్వార్టర్‌లో తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.
- దుబ్బాక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న చిట్టిబాబు 2017, మార్చిలో తన సర్వీస్ రివాల్వర్‌తో అతడి భార్య సరోజను కాల్చి అదే గన్‌తో తనను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. ఉన్నతాధికారుల వేధింపుల వల్లే చిట్టిబాబు ఆత్మహత్య చేసుకున్నాడని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.
- 2017, జూన్‌లో కుకునూర్‌పల్లి పోలీసు స్టేషన్ ఎస్‌ఐ ప్రభాకర్‌రెడ్డి పని ఒత్తిడి కారణంగా తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటో కార్మికులను ఆదుకోవాలి

జిల్లా ఆటో క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు

సిద్దిపేటకమాన్: ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా ఆటో క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు సాయిరాం డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీపథకం వల్ల ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, దానిని నిరసిస్తూ ఆటో డ్రైవర్లు శనివారం సిద్దిపేటలో నిరసన తెలిపారు. హైస్కూల్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సాయిరాం మాట్లాడుతూ ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం అమలు చేయడం ద్వారా ఆటో కార్మికుల ఉపాధికి ఇబ్బంది కలిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్న సుమారు 50 లక్షల మంది ఆటో కార్మికులను దృష్టిలో పెట్టుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని, నెలకు రూ.15 వేల జీవన భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ నేత రఘునందన్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు బీజేపీ సత్తా చాటాలని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో కార్యకర్తలు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు ఓటములను సహజంగా తీసుకోవాలన్నారు. కార్యకర్తలు నిరత్సాహ పడకుండా పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. దుబ్బాకలో జరిగిన ఓటమితో కుంగిపోకుండా నియోజకవర్గ ప్రజల వెన్నంటి ఉండి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని కదిలించాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ సారధ్యంలో బీజేపీ విజయ ఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అంబటి బాలేశ్‌గౌడ్, మద్దెల రోశయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ, కాన్గంటి శ్రీనివాస్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

రూ.4.15 లక్షలు లభ్యం



ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని శ్రీకొండపోచమ్మ ఆలయం హుండీ ఆదాయం రూ.4,15,833 లభించిందని దాదాపు 13 ఏళ్లకు సంబంధించి 360 గ్రాముల బంగారం, 8.6 కిలోల వెండి వచ్చినట్లు ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. 70 రోజులకు సంబంధించిన హుండీని శనివారం లెక్కించారు. అలాగే బంగారం, వెండి అభరణాలను కూడా తూకం వేశారు. మిశ్రమ బంగారం 364 గ్రాములు, వెండి 8.6 కిలోలు వచ్చినట్లు ఈఓ తెలిపారు. వాటిని అమ్మవారి ఆలయం ఖాతాలో జమ చేయనున్నటు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సూపరిడెంట్ శివరాజ్, సర్పంచ్ రజిత రమేశ్, ఆలయ సిబ్బంది అంజనీదేవి, వెంకట్‌రెడ్డి, కనకయ్య, చిన్నా, సుధాకర్ చందు, లక్ష్మణ్, కొండయ్య, తిరుపతి, హరి, మల్లయ్య పాల్గొన్నారు.

30న జాతీయ లోక్ అదాలత్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రఘురాం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురాం

సిద్దిపేటకమాన్: ఈ నెల 30న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం పిలుపునిచ్చారు. సిద్దిపేట కోర్టులో ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్లు, కౌన్సిల్స్‌తో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోర్టులో పెండింగ్‌లో ఉన్న ఎమ్‌వీఓపీ, ఈపీ, చిట్ ఫండ్, ఫైనాన్స్ కేసులు వీలైనంత వరకు రాజీ చేయాలని మేనేజర్లు, న్యాయవాదులకు సూచించారు. సమావేశంలో న్యాయమూర్తులు మురళీమోహన్, స్వాతిరెడ్డి, మిళింద్ కాంబ్లే, చందన, న్యాయవాదులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

'కార్పొరేట్'కు దీటుగా సర్కారీ విద్య



సమావేశంలో విద్యార్థులు, తల్లిదండ్రులు

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): కార్పొరేటు విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన విద్య అందిస్తున్నామని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం వర్గల్ జెడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన విద్యార్థుల, తల్లిదండ్రుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌకర్యాలు, నైపుణ్యాలు, సాంకేతికత, బోధనలో సర్కారు పాఠశాలలు వేటికీ తీసిపోవన్నారు. ప్రపంచంలో శరవేగంగా చోటు చేసుకుంటున్న సాంకేతికతకు అనుగుణంగా ఉపాధ్యాయులను శిక్షణ కార్యక్రమాలతో నిష్ణాతులను చేస్తున్నామని పేర్కొన్నారు. పాఠశాల విద్యలో తల్లిదండ్రుల ప్రాముఖ్యతను పెంచడానికే ఈ సమావేశాలు నిర్వహిస్తుందన్నారు. అనంతరం హెచ్‌ఎం వెంకటేశ్వర్ గౌడ్‌తో కలిసి ఆయన 'మార్స్' సంస్థ అందించిన స్పోర్ట్స్ యూనిఫారాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ దీన, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

21న ఢిల్లీలో మహాధర్నా



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఢిల్లీలో చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దిని రాజమల్లయ్య పిలుపునిచ్చారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో శనివారం ధర్నాకు చెందిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ మహాధర్నా కార్యక్రమానికి యువజన సంఘాల నేతలు, కవులు, కళాకారులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వర్కింగ్ జిల్లా ప్రెసిడెంట్ కృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంకన్న, నాయకులు ఎల్లం, పర్శరాములు, స్వామి, మహేశ్, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ రద్దుతో ఉపాధికి గండి

వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్: రంగారెడ్డి జిల్లాలో నిర్మిస్తున్న ఫార్మాసిటీని రద్దు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయించడం ఎంతరకు సమంజసమని మాజీ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మండిపడ్డారు. గజ్వేల్‌లో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ పనులు పూర్తవుతున్న తరుణంలో ఆ నిర్ణయం సహేతుకం కాదన్నారు. ఫార్మాసిటీ ద్వారా 5లక్షల మందికి ప్రత్యక్షంగా, మరో 10 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభించే అవకాశముండేదన్నారు. కేసీఆర్ తీసుకున్న చొరవ వల్ల ఇక్కడికి 350 పరిశ్రమలు ఇక్కడ ఉత్పత్తులను ప్రారంభించడానికి ముందుకొచ్చాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం వల్ల ఈ పరిశ్రమలు వేరే రాష్ట్రానికి తరలిపోయే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా వడ్లకు వెంటనే రూ.500 బోనస్ అందించాలని డిమాండ్ చేశారు.

ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్ సంపత్



సిద్దిపేటజోన్: పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని, ఎవరైనా నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ శనివారం హెచ్చరించారు. కొన్ని రోజులుగా పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ వాడుతునట్టు అధికారులకు సమాచారం వచ్చిందన్నారు. స్వచ్ఛ సిద్దిపేట లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మినా, నిల్వ చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందుకోసం ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

అదుపు తప్పిన బైక్, ఒకరి మృతి

నర్సాపూర్ రూరల్: ఒక వ్యక్తిని తప్పించబోయి బైక్ అదుపుతప్పి కింద పడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి. చింతకుంట సమీపంలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ శివకుమార్ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ వాసి మహమ్మద్ అతిక్ (28). తన మిత్రుడు మమ్మద్ ఖదీర్‌తో కలిసి శుక్రవారం రాత్రి బైక్‌పై ఏడుపాయల వెళ్లాడు. తిరుగు పయనమవుతుండగా నర్సాపూర్-మెదక్ జాతీయ రహదారిలోని పెద్ద చింతకుంట సమీపాన ఒక వ్యక్తి అడ్డు రావడంతో తప్పించే క్రమంలో వాహనం అదుపు తప్పి కింద పడిపోయారు. దీంతో వీరిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు నర్సాపూర్ ప్రభుత్వానికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్ గాంధీకి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ అతిక్ అదే రోజు అర్ధరాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మోక్షం ఎప్పుడు?

- దశాబ్దాలుగా సాగు
- అయినా పట్టాలు లేవు
- అందని రైతుబంధు
- ఆందోళనలో రైతులు



హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయం

హుస్నాబాద్‌రూరల్: భూ సమస్యలను పరిష్కరించాలని గత ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు 2018 సెప్టెంబరు నుంచి గ్రామాల్లో భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టారు. అందులో భాగంగా పట్టా భూములు, బినామీల ద్వారా కొనుగోలు చేసిన భూముల సమస్యలను పరిష్కరించి పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు. పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతుబంధు పథకం పొందారు. రీఅసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వకపోవడంతో జిల్లాలో వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మద్దూరు మండలంలో 74.08 ఎకరాల భూమి కోసం 416 మంది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా హుస్నాబాద్ మండలంలో 191 మంది రైతులకు చెందిన 189 ఎకరాలు, కోహెడ మండలంలో 159 మంది రైతుల 192 ఎకరాలు, అక్కన్నపేట మండలం 220 మంది రైతులకు చెందిన 320 ఎకరాల అసైన్డ్ భూములకు రీఅసైన్డ్ పత్రాల కోసం ఎదురు చూస్తున్నారు. దశాబ్దాల నుంచి సన్న, చిన్నకారు రైతులు అసైన్డ్ భూముల్లో పంటలు సాగు చేస్తున్నారు. అలాంటి భూములను క్రమబద్ధీకరించి రైతులకు ధ్రువపత్రాలను అందజేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ విషయం మరిచిపోయిందని, అసైన్డ్ భూముల సమస్యలను పరిష్కరించాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అందని రైతుబంధు

1976 అసైన్డ్ భూ చట్టాల గురించి తెలియని రైతులు వారి బంధువులు, ఇతరుల దగ్గర అసైన్డ్ భూములను కొనుగోలుచేసి సాగుచేసుకుంటున్నారు. ధరణి యాప్ వచ్చినప్పటి నుంచి కబ్జా కాలమ్ లేకపోవడంతో రైతులు తమ భూముల వివరాలు ఎక్కడ చూసుకోవాలో అర్థంకాక అయోమయంలో పడ్డారు. మాజీ సీఎం కేసీఆర్ అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన పేద రైతులకు రీ అసైన్డ్ చేస్తామని చెప్పడంతో సమస్యలు తీరుతాయని రైతులు ఆశ పడ్డారు. దీంతో వారంతా రైతుబంధుకు దూరమయ్యారు.

రీ అసైన్డ్‌కు పరిష్కారం



ప్రభుత్వ అసైన్డ్ భూములను గ్రామాల్లో రైతులు సదా బైనామాల ద్వారా కొనుగోలుచేసి సాగు చేస్తున్నారు. అలాంటి భూములను అధికారులు గుర్తించారు. రైతులకు రీ-అసైన్డ్ చేయాలని ప్రభుత్వం చెప్పడంతో అందరి వివరాలను మండలాల వారిగా సేకరించి కలెక్టర్‌కు పంపించాం. గత ప్రభుత్వం అసైన్డ్ భూముల గురించి నిర్ణయం తీసుకోలేదు. కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలు రాగానే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు మోక్షం కలుగుతుంది.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, హుస్నాబాద్

చలి తీవ్రం.. ఆరోగ్యం పదిలం

అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

జగదేవ్‌పూర్(గజ్వేల్): మారుతున్న వాతావరణానికి తోడు చలిపులి వణికిస్తోంది. తెల్లవారుజామున జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. పది రోజులుగా చలి తీవ్రత మరింత పెరిగింది. దీర్ఘకాలిక రోగులకు ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. జలుబు, దగ్గు, గొంతునొప్పి, ఫ్లూ, జ్వరం, ఆయాసం కేసులు పెరుగుతున్నాయి. ఆస్తమా, సీఓపీడీ, అలర్జీ, నిమోనియా, తదితర శ్వాసకోశ వ్యాధులు ఉన్న వారు మరింత ఇబ్బంది పడుతున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్ త్వరగా ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు.

వాతావరణ మార్పులతో సమస్యలు

శీతల వాతావరణంతో అలర్జీ ఎక్కువగా ఉన్నవారు బ్రాంకైటిస్ బారినపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైరస్ శక్తి వంతమవుతుందని వైద్యులు చెబుతున్నారు. దగ్గు, ఆయాసం శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తున్నాయి. ఐదు నుంచి ఆరు రోజుల్లో తగ్గే జబ్బు, అలర్జీ ప్రస్తుతం రెండు వారాలు ఉంటుందని.. పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

పొడిబారుతున్న చర్మం..

చల్లటి గాలులకు చర్మం పొడిబారుతోంది. పెదవులు పగిలి ముఖం కాంతిహీనంగా మారుతోంది. అరికాళ్లు పగిలి ఇబ్బంది పడుతున్నారు. శరీరంలో తేమశాతం తగ్గిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుంది. ఈ తరహా సమస్యలు మధుమేహం రోగులకు వస్తే ఇబ్బందులు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే..

ఆస్తమా, నిమోనియా, సీఓపీడీ, గుండె వ్యాధులతో బాధపడేవారికి చలికాలం కష్టకాలమని వైద్యులు పేర్కొంటున్నారు. చల్లటి ప్రదేశంలో తిరిగినా, చల్లటి ఆహారం తీసుకున్నా, ఏసీ గదుల్లో ఉన్నా ఆస్తమా పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఇన్‌ఫెక్షన్ అయ్యే ప్రమాదముంది. వైద్యం ఆలస్యమైతే క్రమేణా ఊపిరితిత్తుల్లోకి నీరు చేరుతుంది. దీంతో ఊపిరితిత్తుల్లోని పొరలు ఉబ్బిపోయి శ్వాస కష్టంగా మారుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పొగమంచు బారిన పడకుండా ఉండడానికి ఉదయం మాస్కులు ధరించాలి.
- మధుమేహం, గుండెజబ్బు ఉన్నవారు జాగ్రత్తలు తప్పనిసరి. శరీరం పొడిబారకుండా తడిగా ఉండేలా చూసుకోవాలి.
- దగ్గు, జలుబు, జ్వరం, ఉంటే ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకోవాలి. వైద్యుల సలహా మేరకు వైరస్‌ను నియంత్రించే వ్యాక్సిన్‌ను వేయించుకోవాలి.



- గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి. బాగా వేడిగా ఉన్న నీరు వాడకూడదు.
- వాహనాలు నడిపే వారు చేతులకు గ్లౌజ్‌లు వేసుకోవాలి. పొగతాగేవారికి దగ్గరగా వెళ్లకుండా ఉండాలి.
- ఏసీ గదుల్లో, చల్లటి గాలి తగలకుండా చూసుకోవాలి. జ్వరం దగ్గు, జలుబు వంటి సమస్యలుంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

కాచిన నీటిని తాగాలి

శ్వాసకోశ, ఈఎస్‌టీ సమస్యలు ఉన్నవారు చలికాలంలో జాగ్రత్తగా ఉండాలి. నీటిని కాచి చల్లార్చి వడపోసుకుని తాగాలి. వెచ్చని దుస్తులు ధరించాలి. శరీరం పూర్తిగా కప్పి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి పానీయాలు, ఫ్రిజ్ నీరు తాగొద్దు. వేడి ఆహారమే తీసుకోవాలి. చిన్న పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి.

– సత్యప్రకాష్, వైద్యుడు, జగదేవ్‌పూర్

ధనుర్మాసోత్సవాలకు నాచగిరి ముస్తాబు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రంలో ఆదివారం నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు జరుగుతాయని ఆలయ సహాయ కమిషనర్ అన్నపూర్ణ తెలిపారు. ధనుర్మాసం పురస్కరించుకుని ప్రతిరోజు స్వామి వారికి విశేష పూజలు జరుగుతాయన్నారు. రోజుకో పాశురం చొప్పున 30 రోజుల పాటు పాశుర పఠనం జరుగుతుందన్నారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం 23న ముక్కోటి ఏకాదశి పర్వదినం జరుగుతుందన్నారు. తెల్లవారుజామున ఉదయం 5.30 గంటలకు వైకుంఠ ద్వార దర్శనం ఉంటుందని ఆమె తెలిపారు. జనవరి13న గోదా కల్యాణం జరుగుతుందన్నారు. ధనుర్మాసోత్సవాల్లో భక్తులు పాల్గొని తరించాలని కోరారు.



నాచగిరిలో స్వామివారు, అమ్మవారు

సైబర్ మోసం.. డబ్బులు మాయం

బెజ్జంకి(సిద్దిపేట): కోరియర్ పార్ట్‌నర్స్ పేరుతో సైబర్ మోసగాళ్లు రూ. 90 వేలు అకౌంట్ నుంచి విత్‌డ్రా చేసిన సంఘటన శనివారం మండల కేంద్రంలో జరిగింది. వెంటనే బాధితురాలు సంబంధిత బ్యాంకుతో పాటు బెజ్జంకి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 11వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు బెజ్జంకికి చెందిన యువతికి కోరియర్ పార్ట్‌నర్స్ పేరుతో ఫోన్ చేసి పార్సిల్ వచ్చిందని తెలిపారు. ఆర్డర్ చేయలేదని.. పార్సల్ మాది కాదని యువతి తెలిపింది. పార్సిల్ క్యాన్సల్ చేస్తామని ఆన్‌లైన్‌లో రూ. 5 పంపాలని సూచించారు. వారు చెప్పిన విధంగా చేయగా శనివారం రూ. 90 వేలు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు చెందిన వ్యక్తికి తమ అకౌంట్ నుంచి డబ్బులు బదిలీ అయినట్లు తెలిసింది. ఈసందర్భంగా బెజ్జంకి ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. వ్యక్తిగత, బ్యాంకు సమాచారాన్ని ఎవరికి ఇవ్వొద్దని సూచించారు.

18 నుంచి అదాలత్‌లు

మెదక్ కలెక్టరేట్: ఈనెల 18 నుంచి 29వ తేదీ వరకు రోజూ లోక్ అదాలత్‌లు నిర్వహిస్తామని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైరపర్సన్ లక్ష్మీ శారద శనివారం తెలిపారు. జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ సూచనలు మేరకు జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో అదాలత్‌లు నిర్వహిస్తామని తెలిపారు. కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొని తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

కొండపాక(గజ్వేల్): కడుపు నొప్పి భరించలేక కొర్మి రాజయ్య(53) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. మండలంలోని మర్పడ్గ మధిర నాగిరెడ్డిపల్లికి చెందిన రాజయ్య ట్రాక్టర్ , హార్వెస్టర్ డ్రైవరుగా పని చేస్తున్నాడు. ఆయన కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో బాధను భరించలేక శుక్రవారం సాయంత్రం ఇంట్లోంచి వెళ్ళి గ్రామ శివారులో తిమ్మన్ చెరువు సమీపంలోని చెట్టుకు ఉరివేసుకున్నాడు. శనివారం సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

మహిళ అదృశ్యం



మాధురి

పటాన్‌చెరు టౌన్: మహిళ అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ వీరమణి కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని గోకుల్‌నగర్‌కు చెందిన మాధురి ప్రైవేట్ కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రోజు మాదిరిగానే ఈ నెల 14వ తేదీన డ్యూటీకి వెళ్లిన మాధురి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భర్త మధు ఫోన్ చేయగా నా కోసం వెతకవద్దు అని మెసేజ్ పెట్టింది. దీంతో భార్య కోసం మధు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు తప్పిన ముప్పు

- స్కూల్ ఆటోను ఢీకొన్న ట్రాక్టర్
- ఇద్దరికి గాయాలు



గాయపడిన విద్యార్థి రేశ్వంత్

దౌల్తాబాద్(దుబ్బాక): ఆటోలో స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థుల ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. దౌల్తాబాద్ నుంచి మండల పరిధిలోని శేరిపల్లి బందారం ప్రభుత్వ ప్రథమిక పాఠశాలకు ప్రతీ రోజు 62 మంది విద్యార్థులు వెళ్తుంటారు. శనివారం రోజు లాగానే 4వ తరగతి చదువుతున్న 13 మంది విద్యార్థులు ఆటోలో స్కూల్‌కు బయలు దేరారు. అగ్రోస్ రైతుసేవా కేంద్రం వద్దకు వస్తున్న ఆటోను తిర్మలాపూర్ నుంచి దౌల్తాబాద్‌కు వస్తున్న ట్రాక్టర్ ట్రాలీ ఢీ కొట్టింది. దీంతో ఆటోలో వెళ్తున్న చారుకొండ రేశ్వంత్, పెద్దోళ్ల వర్షిత్ గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లి దండ్రులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరి విద్యార్థులను సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి పంపించారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదుచేశామని పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి కుంటలో పడి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని కాసులాబాద్‌లో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పర్వతం నర్సింహులు (42) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో ఈనెల 15న మధ్యాహ్నం గ్రామ శివారులోని వావిల్ల చెరువు కుంటలో చేపల వేటకు వెళ్లాడు. అక్కడ చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి పోయాడు. రాత్రయినా నర్సింహులు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో శనివారం గ్రామంలో వెతుకుతున్న క్రమంలో చెరువు కుంటలో నర్సింహులు మృతదేహం కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని నీటిలో నుంచి వెలికితీసి పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అదృశ్యమై.. రిజర్వాయర్‌లో శవమై..



వేణు (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): అదృశ్యమైన వ్యక్తి మండలంలోని చంద్లాపూర్ శివారు రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో శవమై కనిపించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణానికి చెందిన ఈసరి వేణు(44)కు పట్టణానికి చెందిన సుభాషిణితో 2010లో వివాహం జరిగింది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. వేణు పట్టణంలోని ఓ ప్రైవేట్ హైస్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 12న ఉదయం వేణు, తన కూతురు ఆరాధ్యతో కలిసి స్కూల్ బస్సులో పాఠశాలకు వెళ్లాడు. పాత బస్టాండ్ వద్ద వేణు దిగిపోయాడు. కూతురు సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చింది. రాత్రి వరకు వేణు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సిద్దిపేట టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. శనివారం ఉదయం రంగనాయకసాగర్‌లో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.

లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం

- నిరుపయోగంగా మార్కెట్ షెడ్లు
- రూ.2 కోట్లు వెచ్చించి నిర్మాణం
- నెరవేరని ఉద్దేశం
- పట్టించుకోని అధికారులు



రహదారి పక్కన విక్రయాలు చేస్తున్న వ్యాపారులు

తూప్రాన్: గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్డు పక్కన నిర్మించిన రైతుబజార్ మార్కెట్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. రోడ్డు పక్కన విక్రయాలు చేపట్టవద్దని నిర్మించిన షెడ్లలోనే వ్యాపారం సవ్యంగా చేసుకోవాలనే ఉద్దేశం నెరవేరడం లేదు. వివరాలిలా ఉన్నాయి. తూప్రాన్ పురపాలిక పరిధిలోని 44వ జాతీయ రహదారిపై టోల్ ప్లాజా వద్ద రూ.2 కోట్లతో 2021లో రైతుబజార్ నిర్మాణమైంది. దీనిని అప్పటి మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. మండలపరిధిలోని గ్రామాలతోపాటు, ఇతర గ్రామాలకు చెందిన రైతులు, చిరువ్యాపారులు ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రారంభించి కొన్ని నెలలే ఇక్కడి వ్యాపారులు విక్రయాలు కొనసాగించారు. ఆ తర్వాత.. మార్కెట్ లోపలికి వాహనాలు వచ్చేలా సదుపాయం ఏర్పాటు చేసినా లోపలికి రాకుండానే వెళ్లి పోతున్నాయంటున్నారు. దీంతో చేసేదిలేక వారు గతంలో మాదిరిగానే రోడ్లపై విక్రయాలు నిర్వర్తిస్తున్నారు. అధికారులు అనేక సార్లు అవగాహన కల్పించినా వినియోగదారులు రైతుబజారు లోపలికి రాకపోవడంతో విక్రయాలు లేక నష్టపోయామని వారు చెబుతున్నారు. ప్రస్తుతం రహదారి పక్కనే అమ్ముతున్నారు. ఈ విషయమై రెవెన్యూ, మార్కెట్, మున్సిపల్ అధికారులు వ్యాపారులకు నచ్చజెప్పి తిరిగి మార్కెట్ పరిధిలోనే విక్రయించాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని చిరు వ్యాపారులను హెచ్చరించారు. దీంతో వారు చేసేదేమీ లేక ఇక్కడే విక్రయాలు కొనసాగిస్తున్నారు. కాగా రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన షెడ్లు ఇవాళ నిరుపయోగంగా మారాయి. ప్రజాధనం వృథా చేశారని ప్రజలు విమర్శిస్తున్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

రైతులు, చిరువ్యాపారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. గతంలో పలు మార్లు అవగాహన కల్పించాం. అయిన వారు రహదారి పక్కనే విక్రయిస్తున్నారు. వ్యాపారులకు అనువుగా రైతుబజార్‌ను మార్చి రోడ్లపై దుకాణాలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటాం.

– జాన్‌వెస్లీ, జిల్లా మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి

ఇక్కడ వ్యాపారం సాగడం లేదు

వే సైడ్ రైతు మార్కెట్‌లో వ్యాపారం సాగడం లేదు. వాహనదారులు లోపలికి వచ్చి కొనుగోలు చేసేందుకు ఆసక్తిని చూపడం లేదు. అదే రోడ్డు పక్కన వ్యాపారం చేయడం ద్వారా రోజుకు సుమారు రూ.2 వేల వరకు గిట్టుబాటవుతుంది. మా కుటుంబానికి కొంత ఆసరాగా ఉంది. అధికారులు మమ్మల్ని ఇబ్బందులకు గురి చేయొద్దు

–రూప, చిరువ్యాపారి

సైబర్.. టెర్రర్

- నేరగాళ్ల ఉచ్చులోకి విద్యావంతులు
- అవగాహన కల్పిస్తున్నా చైతన్యం కరవు
- 209 కేసులు నమోదు.. రూ.కోటికి పైగా ఫ్రీజ్

సిద్దిపేటఅర్బన్: సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నేరగాళ్లు కొత్తకొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. పోలీసులు అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో అప్రమత్తత రావడంలేదని పలువురు అధికారులు వాపోతున్నారు.

ఖాతాలు.. ఖల్లాస్

లాటరీ వచ్చిందని, బహుమతులు గెల్చుకున్నారని, నకిలీ ఉద్యోగ ప్రకటనలు, నకిలీ బ్యాంకు అకౌంట్ సమాచారం , లోన్ యాప్‌లు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వంటివి ఆశ చూపుతూ ప్రతి రోజు ఏదో ఒక రూపంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఇవి తెలియని అమాయకులు ఖాతాలు ఖల్లాస్ చేసుకుంటున్నారు. మోసపోతున్న వారిలో ఎక్కువగా ఉన్నత విద్యావంతులే ఉంటుండడం ఆందోళన కలిగించే విషయం. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో 209 కేసులు నమోదు కాగా ఇప్పటి వరకు రూ.1,03,66,427 డబ్బును ఫ్రీజ్ చేశారు.

హత్యలు, ఆత్మహత్యలకు కారణాలు

ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌కు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకున్న వారు, సైబర్ నేరానికి గురైన వారు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. తప్పు జరిగిపోయిందనే అపరాధ భావంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేస్తుండడంతో వారిని హత్యలు చేసిన సందర్భాలు ఉన్నాయి. అప్పులు చేసి బెట్టింగ్ పెట్టిన వ్యక్తి తన కుటుంబాన్ని బలితీసుకున్న ఘటన తాజాగా జరిగిన సంగతి తెలిసిందే.

ఇవి పాటించాలి..

- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ఉండడానికి అనవసర లింకులపై క్లిక్ చేయవద్దు.
- అధికారిక వైబ్‌సైట్‌లో మాత్రమే సమాచారం కోసం సెర్చ్ చేయాలి.
- బహుమతులు, లాటరీ గెల్చుకున్నారని, పార్ట్‌టైం జాబ్, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం అని వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దు.
- మోసపోయిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్‌చేసి వివరాలు చెపితే డబ్బులను తిరిగి పొందే అవకాశం ఉంది.

కొత్త పద్ధతుల్లో మోసాలు



సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. అడ్వాన్స్ టెక్నాలజీ వాడుతున్నారు. గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. అనవసర యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవడం, వాట్సాప్‌కు వచ్చే మెసేజ్‌లు, లింకులను క్లిక్ చేయవద్దు.

– శ్వేత, పోలీస్ కమిషనర్

ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన లారీ

ఇద్దరికి స్వల్పగాయాలు

వర్గల్(గజ్వేల్): రోడ్డు పక్కన నిలిపిన ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వచ్చి ఒక ఇసుక లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన శనివారం తెల్లవారు జామున సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం పోలీస్‌స్టేషన్ సమీపంలో జరిగింది. ఎస్‌ఐ విజయభాస్కర్, బస్సు డ్రైవర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఆర్టీసీ బస్సు శుక్రవారం సాయంత్రం ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్‌కు 32 మంది ప్రయాణికులతో బయల్దేరింది. శనివారం ఉదయం ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు గౌరారం పోలీస్‌స్టేషన్ సమీపంలో రహదారి పక్కన డ్రైవర్ బస్సును నిలిపాడు. అదే సమయంలో హైదరాబాద్ వైపు వెళుతున్న ఇసుక లారీ వెనుక నుంచి బస్సును బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు రోడ్డు కింద చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఇద్దరు ప్రయాణీకులు డొంగిరి దివాకర్, దుర్గం సవిత స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ ఆస్న రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



పొదల్లోకి దూసుకెళ్లిన బస్సు

విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

గ్రామంలో నగటున మూడు దుకాణాలు

రామాయంపేట(మెదక్): జిల్లా పరిధిలోని గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. దీంతో మద్యం గ్రామాలు, తండాల్లో సైతం ఏరులై పారుతోంది. కొన్ని గ్రామాలు, తండాల్లో ఏకంగా వేలం పాటలు నిర్వహించుకొని విక్రయాలు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం బెల్ట్‌షాపులను మూసివేస్తామని ప్రకటించడంతో అందరూ ఊపిరి పీల్చుకుంటున్నారు. అందుకు సంబంధించిన వివరాలిలా.. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో గొలుసు దుకాణాలను మూసి వేస్తామని ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ప్రకటించింది. ఇప్పుడు అధికారంలో ఉండటంతో సీఎం రేవంత్ రెడ్డి బెల్ట్‌షాపులపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. కాగా, జిల్లాలోని ప్రతి గ్రామంలో కనీసం మూడు బెల్ట్‌షాపులు కొనసాగుతున్నట్లు అంచనా. దాని ప్రకారం జిల్లాలోని 469 పంచాయతీల్లో మొత్తం పద్నాలుగు వందలకు పైగా ఈ దుకాణాలు అక్రమంగా కొనసాగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం వాటిని మూసి వేయబోతున్నదని తెలుస్తోంది. ఆ మేరకు ఎక్సైజ్ శాఖ అధికారులు ముందు జాగ్రత్తగా వీటికి సంబంధించిన సమాచారం సేకరించినట్లు తెలిసింది.

జిల్లా పరిధిలో మొత్తం 49 వైన్‌షాపులు, ఆరు బార్లు కొనసాగుతున్నాయి. ఈనెల ఒకటి నుంచి కొత్తగా వైన్స్ షాపులకు టెండర్‌లు దక్కించుకున్న లైసెన్స్‌దారులు వ్యాపారం ప్రారంభించారు. ఒక వైపు ఎన్నికల ఉండటంతో గ్రామాల్లో సైతం బెల్ట్ షాపులు మూతపడ్డాయి. తాజాగా వైన్స్ షాపుల్లో అమ్మకాలు ప్రారంభం కావడంతో గొలుసు దుకాణాల్లోనూ అక్రమ మద్యం విక్రయాలు మొదలయ్యాయి. లైసెన్స్‌దారులు సేల్స్ పెరగడానికిగాను పరోక్షంగా వారే గ్రామాల్లో బెల్ట్‌షాపుల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇన్నేళ్లుగా ఆ శాఖ అధికారులు సైతం బెల్ట్ షాపుల విషయమై చూసీచూడనట్లు వ్యవహరించారనే విమర్శలున్నాయి. జిల్లా పరిధిలోని కొన్ని పట్టణాల్లోని పలు దాబాలు, హోటళ్లలో మద్యం తాగేందుకు సిట్టింగులు ఏర్పాటు చేసుకున్నారని సమాచారం. కొత్త ప్రభుత్వ తీసుకోనున్న చర్యలతో పూర్తిస్థాయిలో ఈ షాపులు మూతపడతాయని ప్రజలు భావిస్తున్నారు. ఈ విషయమై జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్‌ను ఫోన్‌లో సంప్రదించగా, జిల్లాలో ఎక్కడ కూడా బెల్ట్‌షాపులు నడవడం లేదన్నారు. ఎవరైనా అనధికారంగా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



రామాయంపేట ఎక్సైజ్ కార్యాలయంలో స్వాధీనం చేసుకున్న బైక్‌లు

అక్రమార్కులపై కేసులే తార్కాణం

ఎక్సైజ్ శాఖ అధికారులు ఇటీవల జరిగిన ఎన్నికల సందర్భంగా నవంబర్ నెలలో జిల్లావ్యాప్తంగా కీలక పాత్ర పోషించారు. అక్రమ మద్యాన్ని తరలిస్తున్న సుమారుగా 75 వరకు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నర్సాపూర్, మెదక్, రామాయంపేట ఎక్సైజ్ శాఖ పరిధిలో 90 వరకు కేసులు నమోదు చేశారు. నవంబర్ 9 నుంచి 30వ తేదీ వరకు ఈ కేసులు నమోదయ్యాయి. తాము స్వాధీన పర్చుకున్న బైక్‌లను కోర్టుకు స్వాధీన పర్చనున్నట్లు అధికారులు తెలిపారు.

మహిళ దారుణ హత్య

- మంగంపేట అటవీ ప్రాంతంలో మృతదేహం గుర్తింపు
- గుర్తుపట్టకుండా నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు
- దర్యాప్తు జరుపుతున్న పోలీసులు

జిన్నారం(పటాన్‌చెరు): ఒక మహిళ దారుణ హత్యకు గురైంది. ఆమె మృతదేహం దారుణమైన స్థితిలో కనింపించింది. శరీరంలోని కొంత భాగాన్ని కుక్కలు పీక్కొని తిన్న ఉదంతం జిన్నారం మండలం పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వేణుకుమార్ కథనం ప్రకారం.. జిన్నారం మండల పరిధిలోని మంగంపేట గ్రామ అటవీ ప్రాంతంలోని బొమ్మనుకుంటలోని ఓ చెట్టుకింద కాలిపోయిన మృతదేహాన్ని స్థానికులు గమనించారు. ఈ మృతదేహం 20 నుంచి 25 ఏళ్ల మహిళగా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని జంతువులు, కుక్కలు పీక్కుతిన్నాయి. దీంతో నడుం భాగం నుంచి కాళ్ల వరకు ఎముకలే కనిపిస్తున్నాయి. మృతదేహం వద్ద క్లూస్‌టీం అధికారులు నమూనాలను సేకరించారు. పటాన్‌చెరుకు చెందిన వైద్యులు మృతదేహానికి ఘటనా స్థలం వద్దనే పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహం చెవికి కమ్మలు, కాలికి మట్టెలు ఉన్నాయని పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని గుర్తుపడితే 8712656750, 8712656730కు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు. మహిళను పెట్రోల్ పోసి హత్య చేసినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చామని, త్వరలోనే ఈ కేసును ఛేదిస్తామని సీఐ వేణు కుమార్ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జోగిపేటలో స్కూటీ చోరీ

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలోని బృందావన్ కాలనీలో స్కూటీ చోరీకి గురయ్యింది. పట్టణానికి చెందిన సింగారపు సంతోష్‌కుమార్ శనివారం మధ్యాహ్నం తన స్కూటీ (టీఎస్35 ఎ7562)ను ఇంటి ముందు పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లాడు. పది నిమిషాల తర్వాత వచ్చి చూసేసరికి స్కూటీ లేకపోవడంతో బాధితుడు జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.